రంజాన్ ఉపవాస దీక్షలతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: రంజాన్ ఉపవాస దీక్షల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ముఖ్యంగా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆల్ ఇండియా ఖీరత్ కమిటి అధ్యక్షులు ఖారీ మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. రంజాన్ శుక్రవారం ప్రార్థనల సందర్భంగా గోల్కొండ రిసాల బజార్‌లోని దిలావర్గానగర్ అస్కరీ మసీద్‌లో జరిగిన రంజాన్-ఉపవాస దీక్షలు కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలు ఉండడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయన్నారు.

పీఆర్సీ కమిషనర్‌ను కలిసిన అధికారులు


శివశంకర్‌కు వివరిస్తున్న శ్రీనివాసరావు, చిత్రంలో ఎంబీ కృష్ణయాదవ్

నాంపల్లి: తెలంగాణ ఉపాధి, శిక్షణా శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం నేత పసుపులేటి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం బీఆర్కే భవన్‌లో పీఆర్సీ కమిషనర్ శివశంకర్‌ను కలిశారు. పీఆర్సీ-2020లో ఉద్యోగులకు జరిగిన ఆర్థిక నష్టాన్ని, ఐటీఐల స్థితిగతులు, పారిశ్రామిక రంగంలో ఐటీఐల పాత్రను వివరించారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఒత్తిడి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో టీజీఓ హైదరాబాదు జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణయాదవ్, టిట్ గోవా అధ్యక్షులు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్ట్ చట్ట విరుద్ధం



బీజేపీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆప్ సభ్యులు

గన్‌ఫౌండ్రీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిండి సుధాకర్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్ర లేని సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం చట్ట విరుద్ధమన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ చేతులో కీలుబొమ్మలుగా మారి ప్రతిపక్ష నేతల అణచివేతకు సాధనాలుగా మారాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆప్ నాయకులు బుర్రా రాము గౌడ్ డాక్టర్ అన్సారి, మల్లంగి విజయ్, హేమ, జావేద్, తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీకి సన్మానం


దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న మెట్టు సాయికుమార్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని రాష్ట్ర ఫిషరీష్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆమెను సన్మానించి మిఠాయిలు అందజేశారు. చిన్న వయస్సులో తనకు చైర్మన్ పదవి అప్పగించిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

కాంగ్రెస్ ఆఫీసు ముందు ధర్నా చేస్తా


మంత్రి పొన్నంకు మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: 33 సంవత్సరాలుగా పార్టీలో కష్టపడి పనిచేస్తున్న తనకు పార్టీ గుర్తించి మేరు సంఘం తరపున చైర్మన్ పదవి ఇవ్వాలని లేకపోతే ఢిల్లీలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ముందు ఆందోళన దిగుతానని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరి, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షులు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మెమోరాండం అందజేశారు. 33 సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న తనకు 2004 నుంచి 2023వ సంవత్సరం వరకు అసెంబ్లీ పార్టీ టికెట్టుగాని లేదా చైర్మన్‌గా ఇంత వరకు ఇవ్వలేదన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు నేతల నివాళి

జియాగూడ: జియాగూడను అభివృద్ధిని చేసిన ఘనత మాజీ కార్పొరేటర్ దివంగత మునేందర్‌కే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర దళితమోర్చ మాజీ అధికార ప్రతినిధి సతీష్‌బిడ్ల అన్నారు. శుక్రవారం జియాగూడలోని దోర్‌బస్తీ వీరశైవ కక్కయ్య సమాజ్ కమ్యూనిటీహాల్‌లో మునేందర్ సంతాప సభ నిర్వహించారు. డివిజన్ దళిత మోర్చ అధ్యక్షులు సూరజ్‌బిడ్ల ఆధ్వర్యంలో ఏర్పాటైన సంతాప సభలో ఆయన ప్రసంగిస్తూ 2002లో కార్పొరేటర్‌గా ఉన్న మునేందర్ కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థ ద్వారా సుమారు రూ.15 కోట్ల నిధులతో డివిజన్‌లో మౌళిక సదుపాకాల కల్పన అభివృద్ధి పనులు చేశారన్నారు. అయినప్పటికి ఆర్థికంగా కడునిరుపేదగా జీవనం గడిపారని, నేటికీ వారి కుటుంబానికి సొంత ఇల్లు లేదన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్, నియోజకవర్గం కన్వీనర్ గోవర్ధన్ పాల్గొన్నారు.

పోషకాహార లోపంవల్లే ఆరోగ్య సమస్యలు

చార్మినార్: ప్రభుత్వ సిటి కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ మహిళా సదస్సులో భాగంగా శుక్రవారం పోషకాహారం, స్త్రీలు పిల్లలు అనే అంశంపై పలువురు వక్తలు మాట్లాడారు. సాధికారిత విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాల భాస్కర్ పర్యవేక్షణలో ఈ అంతర్జాతీయ మహిళా సదస్సు జరిగింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం పూర్వ అధ్యక్షులు డాక్టర్ విజయా కాదర్ పోషక ఆహారంతో పాటు స్త్రీలు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం పిల్లలకు, మహిళలకు ప్రవేశ పెడుతున్న అనేక పథకాలను వివరించారు. తరువాత మిత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బెంగుళూర్ సభ్యులు డా కరణం రమేష్ కుమార్ పర్యావరణ ప్రభావం అంటు వ్యాధులు అనే అంశం పై ప్రసంగించారు.

విందు.. పసందు


నాన్‌కీ రోటీ-పాయా షోర్వా డిష్

రంజాన్‌లో నోరూరిస్తున్న వంటలు...

- నాన్‌కీరోటీ-పాయా షేర్వా... భలే పసందు.
- ఎముకలకు బలాన్నిచ్చే పాయా షేర్వా...
- మసాలా దినుసులు, నూనె పదార్థాలు లేని నాన్‌కీ రోటి..
- పేద, ధనిక తారతమ్యం లేని డిష్..
- పాతబస్తీ ప్రధాన హోటళ్లలో అధికంగా విక్రయాలు.

చార్మినార్: రంజాన్ మాసంలో మాంసార వంటలు నోరూరిస్తున్నాయి. ముస్లిం సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మాంసార వంటలు అందుబాటులో ఉన్నాయి. పాతబస్తీలో సాధారణ రోజుల్లో లభించే నాన్‌కీరోటీ, పాయాషోర్వా వంటకం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. రంజాన్ మాసంలో వీటిని విక్రయించే హోటళ్లు అధికం. పేద,ధనిక అనే తారతమ్యం లేకుండా నాన్‌కీరోటీ,పాయాషోర్వా తింటారు. దీంతో ఈ వంటకానికి ప్రజల నుంచి విపరీతమైన ఆదరణ ఉంది. ప్రస్తుతం హోటళ్ల వద్ద ఈ వంటకాన్ని ఖరీదు చేయడానికి క్యూ కడుతున్నారు.

నాన్‌కీ రోటీ...

సాధారణ రోజుల్లో ముస్లింలు ఉదయం లేవగానే బ్రేక్ ఫాస్ట్‌లో నాన్‌కీ రోటిని పాయాషోర్వాతో కలిపి తినే కుటుంబాలున్నాయి. ప్రస్తుతం రంజాన్ మాసం కొనసాగుతుండడంతో దీనికి మరింత ఆదరణ పెరిగింది. పాతబస్తీ సంస్కృతికి ఆచార వ్యవహారాలకు నాన్‌కీ రోటి గుర్తుగా నిలుస్తోంది. ఒకప్పుడు కేవలం ముస్లిం ప్రజలు మాత్రమే తినే ఈ నాన్‌కీ రోటిని ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు లొట్టలేసుకొని మరీ తింటున్నారు. ఎలాంటి మసాలా దినుసులు, నూనె పదార్థాలు


నాన్‌కీ రోటీ

వాడకుండా కేవలం మైదా పిండితో తయారయ్యే ఈ నాన్‌కీ రోటి పేదోడి దగ్గర నుంచి సంపన్న వర్గాల వరకు అందుబాటులో ఉంటుంది.

ఫర్షియా భాషలో రోటిని 'నాన్' అంటారు..

ఫర్షియా భాషలో రోటిని 'నాన్' అంటారు. 400 ఏళ్ల క్రితమే ఈ నాన్‌కీ రోటి మనకు అలవాటయ్యింది. ఇరాన్, టర్కీ (టర్కిస్థాన్) దేశాలకు చెందిన 'డిష్' ఇది. మిడిల్ ఈస్ట్ (అరబ్బు దేశాలు) నుంచి ఈ ఫుడ్ కల్చర్ మన దేశానికి వ్యాపించింది. పాతబస్తీలోని డబీర్‌పురా, చంచల్‌గూడ, యాకుత్‌పురా, ఆజంపురా, బడేబజార్, పురానీహవేళీ, దారుషిఫా, చార్మినార్, మదీనా, ఖిల్వత్, బార్కాస్, బహదూర్‌పురాలతో పాటు సికింద్రాబాద్, మల్లేపల్లి, నాంపల్లి తదితర ప్రాంతాలలో 200కు పైగా నాన్‌కీ రోటి తయారీ కేంద్రాలున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. వీటి ద్వారా కొన్ని వందల కుటుంబాలు రోజు వారి ఉపాధి పొందుతున్నారు. లక్షకు పైగా నాన్‌కీ రోటీలు రోజు వారి విక్రయాలు జరుగుతాయంటున్నారు. కాళ్ల చోర్వా (పాయా), నారీ కుల్చా, పెరుగు, చికెన్ 65, మటన్ మసాలాలతో ఈ నాన్‌కీ రోటిని తింటారు. ప్రస్తుతం రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందులో నాన్‌కీరోటి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పేద, గొప్ప అనే తారతమ్యం లేకుండా నాన్‌కీ రోటి తప్పనిసరిగా తీసుకుంటున్నారు.


షేర్వా...

ఎముకలకు బలాన్నిచ్చే పాయా షేర్వా...

ఎముకలకు బలాన్నిచ్చే పోషక విలువలు అధికంగా ఉన్న పాయా షోర్వాను సాధారణ రోజుల్లో కన్నా రంజాన్ మాసంలో పాతబస్తీ ప్రజలు ఇష్టంగా తింటారు. ఇక్కడి ప్రముఖ హోటళ్లలో తెల్లవారుజామున 4 గంటల నుంచే అందుబాటులో ఉంటుంది. తిరిగి సాయంత్రం ఇఫ్తార్‌కు ముందే ఆయా ప్రాంతాల్లోని హోటళ్లలో పాయాషోర్వాను విక్రయిస్తున్నారు. నాన్‌కీ రోటీతో పాటు పాయా (మేక కాలు) షోర్వా (మసాలా పులుసు), జెబ్డా(దవడ),జబాన్(నాలుక) భలే రుచిగా ఉంటాయని బోజన ప్రియులు అంటున్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్ మార్చ్‌లో మాట్లాడుతున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య

గౌలిపురా: రానున్న పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని శుక్రవారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... రానున్న ఎన్నికల సందర్భంగా ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్ నిర్వహించామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ సి. శ్రీను, ఎస్సైలు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది. 'కలర్స్ ఆఫ్ హోలీ' టాక్ ఇన్ హిందీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సీనియర్ రాజ యోగ టీచర్ బికే కోమల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు 040 23001234లో సంప్రదించవచ్చు.

ప్రభుత్వం విద్యావ్యవస్థను పటిష్ట పరచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

గన్‌ఫౌండ్రీ: సమాజంలో మనుషులు ఉన్నతంగా బతకాలంటే విద్య తప్పనిసరి అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ ఆకాంక్షలు – విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో విద్య పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. గత ప్రభుత్వం మేధావులతో, విద్యా నిపుణులతో మాట్లాడే ప్రయత్నం కూడా చేయకపోవడం బాధకరమన్నారు. కేజీ2 పీజీ ఉచిత విద్య అని చెప్పి అనేక ప్రభుత్వ పాఠశాలలను మూసి వేశారని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టపరిచి నాణ్యమైన విద్యను అందిస్తున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టారన్నారు. విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన వారిని సన్మానిస్తూ కేంద్ర ప్రభుత్వం పాశవికంగా వ్యవహరించడం సరికాదన్నారు. సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ జాతీయ కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.... విద్య, సామాజిక న్యాయం, భావజాలంపై ప్రస్తుత సమాజంలో దాడి జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ సీఎల్ విశ్వేశ్వర రావు, టీపీటీ రాష్ట్ర అధ్యక్షులు తిప్పర్తి యాదయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొండ నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షులు డాక్టర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి రసరంజని నాటకోత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, చిత్రంలో ముట్నూరి కామేశ్వరరావు, మోహన్ సేనాపతి

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 31వ వార్షికోత్సవం సందర్భంగా రసరంజని నాటకోత్సవాలు ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు రవీంద్ర భారతి వేదికపై ప్రదర్శించనున్నట్లు రసరంజని సంస్థ అధ్యక్షులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని నసీబ్ రెసిడెన్సీ క్యాంపు కార్యాలయంలో రసరంజని నాటకోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ సభ జరిగింది. ఆంధ్ర నాటక కళా పరిషత్ అధ్యక్షులు బొల్లినేని కృష్ణయ్య అధ్యక్షతన జరిగే సభకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై నాటకోత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తులసి బాలకృష్ణ రచించి, దర్శకత్వం వహించిన అపరాధ పరిశోధక నాటకం 'నివురు' నాటకాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. రసరంజని సంస్థ కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు, కోశాధికారి మోహన్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

యువ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానం

రసరంజని సంస్థ 2024, 2025వ సంవత్సరానికి గాను యువ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు డాక్టర్ కె.వి.రమణాచారి తెలిపారు. నాటకరంగంలో సేవలందిస్తున్న యువతకు ఈ పురస్కారాన్ని అందజేస్తామని, 40 ఏళ్ల వయస్సు లోపు కలిగిన యువతీయువకులు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నేడు బీజేపీ నియోజకవర్గం సమావేశం

రాయదుర్గం: బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం 9 గంటలకు చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో జరుగుతుందని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్‌లోని బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల, బూత్ స్థాయి అధ్యక్షులు, సభ్యులు శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చేవెళ్ల బీజేపీ పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

మజ్లిస్ కార్యాలయంలో ప్రజాదర్బార్

మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి


బస్తీలో పర్యటిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: పవిత్ర రంజాన్ మాసాన్ని శాంతి సుహృద్భావ వాతావరణంతో ఉపవాస దీక్షలు ఉండాలని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసి అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లోని సయిదియా మసీద్‌లో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌తో కలిసి శుక్రవారం ప్రార్థనలు ఆచరించారు. అనంతరం ఆయన హకీంపేట్‌లో పాదయాత్ర చేసి ప్రజలను కలుసుకున్నారు. ప్రజా సమస్యలు వినడానికి మజ్లిస్ పార్టీ కేంద్ర కార్యాలయమైన దారుసలాంలో ప్రతినిత్యం ప్రజల సమస్యలు వినడానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తామని ఆయన అన్నారు. మజ్లిస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లే కాకుండా స్వయం తాను కూడా ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చే యువత కోసం మజ్లిస్ పార్టీ స్వాగతం పలుకుతుందని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్, హారూన్‌ఫరాన్, అమీరుద్దీన్ ఉన్నారు.

రోడ్డుపై ఆయిల్

వాహనాదారుల కళ్లల్లో దుమ్ముధూళి

గోల్కొండ: ప్రమాదం జరిగి దాదాపు వారం గడుస్తున్నా కూడా ఇంకా రోడ్డుపై ఆయిల్, దుమ్ముధూళి పేరుకుపోయాయి. గత శుక్రవారం రాత్రి టోలిచౌకీ యుసుఫ్ టేక్డీలోని ఆయిల్ గోదామ్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గోదామ్‌లో ఉన్న వేలాది గ్యాలెన్‌ల ఆయిల్ రోడ్డుపైకి వచ్చింది. ఈ విధంగా రోడ్డుపై వచ్చిన ఆయిల్ కాలువలా ప్రవహిస్తూ అటూ టోలిచౌకీ చౌరస్తా, ఇటూ నానల్‌నగర్ చౌరస్తా వరకు వచ్చింది. కాగా ప్రమాదం గత శుక్రవారం జరిగితే మరునాడు జిల్లా కలెక్టర్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలు


టోలిచౌకీ-మెహిదీపట్నం రోడ్డుపై ఆయిల్


అధ్వానంగా ప్రధాన రహదారి

కూడా ఇచ్చారు. అయితే ఆయన ఆదేశాలను అధికారులు నత్తనడకన పాటిస్తున్నారు. ప్రతి గంటకు వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై గురువారం వరకు కూడా ఆయిల్ పేరుకుపోయి ఉంది. సహాయక చర్యల్లో భాగంగా రోడ్డుపై పారుతున్న ఆయిల్‌పై అధికారులు మట్టి, పౌడర్‌ను చల్లారు. అధికారులు మాత్రం ఒక జేసీబీ, వ్యర్థాలను తరలించేందుకు ఒక మినీ లారీ, రోడ్డు ఊడ్చడానికి ఒక బేబీ స్వీపింగ్ మిషన్ మాత్రమే వాడుతున్నారు. సుమారు మూడు కిలో మీటర్ల రోడ్డుపై ఆయిల్ ఉండగా అధికారులు మాత్రం కంటితుడుపుగా బేబీ స్వీపింగ్ మిషన్ వాడుతున్నారు వాహనాల రాకపోకలకు రోడ్డంతా దుమ్ముతో మబ్బులాగా ఏర్పడుతుంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యలు తెలుసుకునేందుకు తాను స్వయంగా ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకుంటున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లోని రిసాలబజార్, దిలావర్‌షా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకోని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎక్కడ కూడా నల్లాలో వచ్చే తాగునీటికి ఎటువంటి కోతలు లేవని ప్రజలకు కావాల్సిన తాగునీరు అందుతుందని ఆయన అన్నారు. టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, అమీన్‌పాషా తదితరులున్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి పనితీరు భేష్


వైద్యులతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమీషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి పనితీరు అద్భుతంగా ఉందని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఔట్‌పేషంట్ విభాగం, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. ఓపీలో వైద్యులు ఉన్నారా లేరా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లాతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ముందుగా ఇన్‌పేషంట్‌లు ఉండే వార్డును సందర్శించి అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు. మందులతో పాటు ఇతర వస్తువులు కూడా మీ అందరికి సమయానికి అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. అనంతరం ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి టెక్నీషియన్‌లతో మాట్లాడారు. ఆ తరువాత ఐసీయూ రూమ్‌లు సందర్శించారు.

తెలుగు వర్సిటీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం


వస్తు ప్రదర్శనశాలను ప్రారంభిస్తున్న ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలు, కళలకు నేటి సమకాలీన ఆధునికతను జోడించి విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా వివిధ రకాల కోర్సులను ప్రారంభించనున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ప్రాంగణంలో డిజైన్ విభాగం విద్యార్థులు నిర్వహించిన వస్తు ప్రదర్శనను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులు డిజైన్ విభాగం ద్వారా వివిధ వృత్తి కోర్సులను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులకు తక్కువ రుసుముతో ప్రవేశాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. డిజైన్ విద్యార్థులు నిర్వహించిన వస్తు ప్రదర్శనశాలలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదో అంతస్తు నుంచి పడి కార్మికుడి మృతి

బహదూర్‌పుర: ఐదో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ భవన నిర్మాణ కార్మికుడు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన బహదూర్‌పురపోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.... కిషన్ బాగ్ చిరాగ్ అలీనగర్‌లో ఓ వ్యక్తి ఐదంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం మహబూబ్ నగర్ జిల్లా కొల్లూరు మండలం నర్లాపూర్ గ్రామానికి చెందిన రమేష్(27), ఛత్తీస్ ఘడ్‌కు చెందిన సుఖ్ చంద్‌లు పనిచేస్తున్నారు. ఐదో అంతస్తుకు సిమెంట్, ఇతర సామగ్రి తీసుకెళ్లే మిషన్‌ను సరిచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మిషన్ పక్కకు జరగడంతో ఒక్కసారిగా ఇద్దరు కిందపడిపోయారు. రమేష్ నేరుగా నేలపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సుఖ్ చంద్ ఇసుకపై పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అదృశ్యం


సాయి కిరణ్

గచ్చిబౌలి: ఇంటి ముందు ఆడుకుంటూ ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండలోని శివాజీ నగర్‌లో నివాసం ఉండే సాయి కిరణ్ (8) ఈ నెల 16న ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు స్వామి, కనకలక్ష్మీ సమీప ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బంధువుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో గురువారం రాయదుర్గం పీఎస్‌లో తల్లి కనకలక్ష్మీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.